క్లుప్తంగా

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

అద్దంకి: అద్దంకి, కొరిశపాడు మండల పరిధిలోని పశువులకు నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టాకాలు వేస్తామని ఏడీ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మండలాల్లోని పశు వపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. మండలాల్లో టీకాల కార్యక్రమ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని తెలిపారు. టీకీలు వేయడం వలన పశువులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, జ్వరం వస్తుందని.. పాలు తగ్గుతాయనే అపోహలు వీడి పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు.

ఘనంగా హరి సర్వోత్తమరావు జయంతి



సర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు (అద్దంకి): గ్రంథాలయ ఉద్యమ కారుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతిని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం గ్రంథ పాలకుడు బి. భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. దానిలో భాగంగా హరి సర్వోత్తమ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తరువాత చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు. వారికి పుస్తకాలు చదవడం వలన కలిగే లాభాల గురించి గ్రంథపాలకుడు వివరించారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రజావేదిక

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించామని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ ప్రజా వేదికకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పాలకులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

చీరాల అర్బన్: చీరాల నియోజకవర్గంలోని 120 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి సంక్షేమ నిధి నుంచి రూ.1.2 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య లబ్ధిదారులకు అందించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందన్నారు. మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రశీదులను సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే వాటిని విచారించిన అనంతరం వారికి సీఎం సహాయనిధి అందిస్తారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదాల్లో గాయాలు



గాయాలపాలైన వెంకటేశ్వర్లు

అద్దంకి రూరల్: పట్టణంలో రెండు ప్రాంతాల్లో ఆదివారం రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. అద్దంకికి చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు రాజీవ్ కాలనీ జంక్షన్ వద్ద బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలయ్యాయి. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ మార్కెట్ యార్డు వద్ద యువకులు వేణు, రోహిత్‌లు బైకు మీద వెళుతూ ఆటోను ఢీకొట్టారు. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.

రోబోటిక్స్‌పై అవగాహన ఉండాలి



పాఠశాలలకు లాప్‌టాప్‌లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఇంకొల్లు(చినగంజాం): విద్యార్థులు, ఉపాధ్యాయులు కృత్రిమ మేధ, రోబోటిక్స్‌పై అవగాహన కలిగి ఉండాలని దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కఠారి భాస్కరరావు సూచించారు. దుద్దుకూరు హైస్కూల్‌లో స్పైక్ ప్రైమ్ రోబోటిక్స్ శిక్షణ కార్యక్రమంలో ఆదివారం ముగిసింది. హెచ్‌ఎం కఠారి భాస్కరరావు, శిక్షకుడు జవ్వాది సంకల్ప సిద్ధార్థ్, ఎన్‌ఆర్‌ఐ రాయిని సుబ్బరామయ్య, ట్రస్ట్ ప్రతినిధి చెన్నుపాటి జనార్దనరావు, ఈఎన్‌టీ వైద్యులు, ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ కొర్రపాటి సుధాకర్, తేళ్ళ అరుణ హాజరయ్యారు.

పీడీలు లేకుండా స్కూల్ గేమ్స్‌ పోటీలా?



ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీలు



పీడీలేని కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

బల్లికురవ:

అండర్- 14,17 పోటీలు నామ్‌కేవాస్తేగా మమగా ముగుస్తున్నాయి. అయితే పీడీలు లేకుండానే స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించటం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 11 ఉన్నత పాఠశాలల్లో మూడు నెలలుగా 10 పాఠశాలల్లో పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోటీలకు విద్యార్థులను సంసిద్ధులను చేయలేక పంపలేక పోవటంతో బల్లికురవ, కొణిదెనన, ఉప్పుమాగులూరు, పెద అంబడిపూడి, వైదన, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం ఉన్నత పాఠశాలలో పీడీ పోస్టులున్నాయి. వేసవిలో జరిగిన సాధారణ బదీల్లో భాగంగా పెద అంబడిపూడి ఉన్నత పాఠశాల పీడీ అరుణ మినహా మిగిలిన వారంతా వివిధ ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీపై వెళ్లారు. ఈ పాఠశాలలో 3 నెలలుగా పీడీ పోస్టులు ఖాళీతో విద్యార్థులు ఆటల పట్ల దృష్టి పెట్టలేక పోతున్నారు. ముక్తేశ్వరం, కూకట్లపల్లి, కొప్పరపాలెం, వల్లాపల్లి, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా స్థాయి పెంపుదల చేశారు. ఇక్కడ పీడీ పోస్టులు భర్తీ చేయలేదు. శుక్రవారం ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో అండర్ 14,17 ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. 15 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల చేత అంబడిపూడి పీడీ ఆటలు ఆడించి మమ అనిపించారు. సోమవారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించాల్సి ఉంది. అయితే పీడీలు లేకుండానే పోటీలు నిర్వహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులు ఇటీవల జరిగిన డీఎస్సీలో ఎంపికైన పీడీలను 10 పాఠశాలలకు కేటాయించాలని విద్యతోపాటు క్రీడల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



బల్లికురవ ఉన్నత పాఠశాల

అశోక్ కుమార్‌ను కలిసిన అద్దంకి నాయకులు



అశోక్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న యువనాయకులు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన సమన్వయ కర్త చింతలపూడి అశోక్‌కుమార్‌ను ఆదివారం పిడుగురాళ్ల వెళ్లి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో యువనాయకులు బత్తుల రాజశేఖర్, భూమా సత్యనారాయణ రెడ్డి, మన్నెం రాజశేఖర్, గుడిమెట్ల శేఖర్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు శిరిగిరి బ్రహ్మం మృతి

పర్చూరు(చినగంజాం): రాష్ట్ర మాజీ మేదర కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగిరి పద్మావతి భర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శిరిగిరి బ్రహ్మం (70) ఆదివారం మృతి చెందారు. పర్చూరులోని ఆయన స్వగృహంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు పర్చూరు మండల పార్టీ అధ్యక్షుడు కఠారి అప్పారావు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రోటేరియన్ కోట శ్రీనివాసరావు, పర్చూరు గ్రామ సర్పంచ్ మల్లా అంజమ్మ, మాజీ సాంస్కృతిక విభాగం డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, సీనియర్ నాయకులు మల్లా శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, పేర్ని హరి తదితరులు పాల్గొన్నారు.



శిరిగిరి బ్రహ్మం భార్యకు నగదు సాయం అందజేస్తున్న కన్వీనర్ కఠారి అప్పారావు, నాయకులు

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసుకుందాం



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీఎస్సార్ ఆంజనేయులు

చినగంజాం: గ్రామాభివృద్ధి కోసం సోపిరాల గ్రామాన్ని ప్రత్యేకంగా పంచాయతీగా ఏర్పాటు చేసుకునేందుకు గ్రామప్రజలంతా ఏకాభిప్రాయంతో ముందుకు వెళదామని మాజీ మున్సిపల్ కమిషనర్ టీఎస్సార్ ఆంజనేయులు అన్నారు. గ్రామంలోని స్థానిక శ్రీ లలితా రామకోటేశ్వర దేవస్థానంలో గ్రామ పెద్దలు ఆదివారం సాయంత్రం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం సోపిరాల గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేసుకొని గ్రామానికి అవసమైన వనరులను సమకూర్చుకుందామని, గ్రామంలో నెలకొని ఉన్న పలు సమస్యలను పరిష్కరించుకుందామని, గ్రామాన్ని వైద్యం, విద్య, మౌలిక వసతులు, ఆర్థిక పరంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. కుర్రి రామసుబ్బారావు, టి. సీతారామయ్య, గంటా వెంకటస్వామి, ఏడుగుండ్ల నాగేశ్వరరావు, టి. జయరావు, టి. శ్రీనివాసరావు, పి. లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


విశ్వకర్మ జయంతి జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విశ్వకర్మ సంఘ సమితి ప్రతినిధులు

జె.పంగులూరు: మండల విశ్వబ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17 న నిర్వహించనున్న శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలని మండల సంఘం అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్యాపురం గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం నందు విశ్వకర్మ జయంతి సందర్భంగా శ్రీ గాయత్రీ సమేత విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక మండల విశ్వబ్రాహ్మణ సంఘం 21 వ వార్షికోత్సం వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి రామకృష్ణ, కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్రప్రసాద్, ట్రెజరర్ రావినూతల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కాజన అప్పయ్య పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను కలిసి విన్నవించారు. యాప్‌లు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనలకే పరిమితం చేయాలని కోరారు. బి.సాంబశివరావు, చుక్కా శ్రీనివాసరావు, దండా నారాయణ, కల్లం వెంకటేశ్వరరెడ్డి, డి.నాగరాజు, డి.మధు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేకు సహకరించండి

బల్లికురవ: గ్రామాల వారీగా ప్రజలకు ఉన్న ఆస్తులను గుర్తించి హక్కు పత్రాలు అందించేందుకు జరుగుతున్న స్వామిత్వ సర్వేను సహకరించాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. ఆదివారం గుంటుపల్లి, బల్లికురవ గ్రామాల్లో సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ మాసాంతానికి సర్వే పూర్తి చేయాలని సెక్రటరీలను ఆదేశించారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

కారంచేడు: ఈనెల 15వ తేదీన మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయిలో అండర్ -14, అండర్- 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా అథ్లెటిక్స్‌లో బాల, బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు.. విద్యార్థులను వయస్సు ధ్రువీకరణ పత్రాలతో తీసుకువచ్చి పోటీలు అనంతరం జాగ్రత్తగా దగ్గరుండి తీసుకువెళ్లాలని సూచించారు.

కారంచేడు: ఈనెల 15వ తేదీన ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు మండల కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు, పీడీలు, విద్యార్థులను జాగ్రత్తగా తీసుకువెళ్లాలన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పడిమిడిపాడు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం మండల స్థాయి ఆటల పోటీలు (అథ్లెటిక్స్) నిర్వహిస్తామని మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా ఈ పోటీలకు అర్హులని హెచ్‌ఎం అంజయ్య తెలిపారు. వివరాలకు 62814 22319 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

చీరాల రూరల్ :మండల స్థాయిలో ఆటల పోటీలు, ఎంపికలు ఈనెల 16, 17 తేదీల్లో జాండ్రపేటలోని బీవీఅండ్‌బీఎస్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు చీరాల మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పాలపర్తి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహా కావ్యం 'కల్పవృక్షం'



మాట్లాడుతున్న అప్పాజోస్యుల సత్యనారాయణ

చీరాల అర్బన్: కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన శ్రీమద్రామాయణ కల్పవృక్షం కాలంలో నిలిచే మహాకావ్యమని సాహితీవేత్త అప్పాజోస్యుల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సాహితీసదస్సులో విశ్వనాథ వ్యక్తిత్వ, కవిత్వాలను సోదాహరణంగా ఆయన వివరించారు. ఆధునికుల్లో విశ్వనాథను ఏ కవితో పోల్చలేని విలక్షణ కవి అన్నారు. సదస్సుకు సంస్థ అధ్యక్షుడు గాదె హరిహరరావు అధ్యక్షత వహించారు. అనంతరం వక్త అప్పాజోస్యుల సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. యస్.యల్లమందారెడ్డి, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, పూర మస్తాన్‌రావు, నాగవీరభద్రాచారి, పి.శివాంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, బీరం సుందరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం మృగశిర నక్షత్రం అష్టమి సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.















